RNI NO. TELTEL 2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక


ఎటిటర్ జి. శ్రీనివాస్ సంపుటి 02 సంచిక 475 శుక్రవారం 27 జూన్ 2025 పేజీలు:4 వెల 2/-

Simultaneously Published from Andhra Pradesh &Telangana

## బ్లాక్ బాక్స్ డేటా డౌన్‌లోడ్

ప్రమాద కారణాలు తెలిసే ఛాన్స్

సీవీఆర్, ఎఫ్‌డీఆర్ డేటాను విశ్లేషిస్తున్న ఏఏఐబి నిపుణులు




## టోల్ వసూలు చేసే ఉద్దేశమే లేదు

తప్పుడు వార్తా కథనాలు ప్రసారం చేయడం తగదు

కేంద్రం ప్రకటన విడుదల

ఎక్స్‌లో వివరణ ఇచ్చిన ఎన్‌హైచ్ఐఏ




# 6 నెలల్లో 122 కేసులు

ప్రతి పనికి ఓ రేటు... లంచం మా హక్కు అన్నట్లు వ్యవహారం

సగటున ప్రతి 3 రోజులకు 2 కేసుల నమోదు

వరుసగా పట్టుబడుతున్న అక్రమార్కులు

కేసులు, విచారణలతో ముచ్చెమటలు పట్టిస్తున్న ఏసీబీ

ఫిర్యాదులకు తక్షణమే స్పందిస్తున్న అ.ని.శా

> ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేస్తున్న లంచావతారులు ఏమాత్రం జంకడం లేదు. గత కొన్ని రోజులుగా అక్రమార్కులు వరుసబెట్టి ఏసీబీకి పట్టుబడుతున్నారు. తెలంగాణ ఏసీబీ ఈ స్థాయిలో విరుచుకుపడటం ఈ మధ్యకాలంలో ఇదే మొదటిసారి.. అందుకే కేసుల సంఖ్య గణనీయంగా నమోదవుతోంది. ఏసీబీ అధికారుల సత్వర స్పందనతో బాధితుల్లో సైతం నమ్మకం కుదురుతోంది. దీంతో బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులు కూడా పెరుగుతున్నాయి.అయితే ఏసీబీ అధికారుల అధికారిక టోల్‌ఫ్రీ నంబర్ 1064తోపాటు 94404 46106 వాట్సాప్ నంబరు, ఫేస్‌బుక్, ఎక్స్ లాంటి సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్స్ ద్వారా కూడా ఫిర్యాదు చేసే సౌలభ్యం ఉంది.

**హైదరాబాద్, జూన్ 26**
తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు అక్రమార్కులపై దృష్టి సారించారు. ఏసీబీ అధికారులు ఎన్నడూ లేని విధంగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో అక్రమార్కులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. గత 6నెలల్లోనే 122కేసులు నమోదు చేసి, వందలా మందిని కటకటాలపాలు చేశారు ఏసీబీ అధికారులు. లంచగొండి అధికారులపై మరింత దూకుడుగా వ్యవహరిస్తూ వరుస కేసులు, విచారణలతో ముచ్చెమటలు పట్టిస్తున్నారు.తెలంగాణలో ఏసీబీ అధికారులు గత ఏడాది 2024లో మొత్తం 129 ట్రాప్ కేసులు నమోదు చేస్తే, ఈ ఏడాది 6 నెలలు పూర్తికాక ముందే ఈ సంఖ్య 122కు చేరుకోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. రాష్ట్రంలో సగటున ప్రతి 3 రోజులకు 2 కేసుల చొప్పున నమోదవుతున్నాయి. ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేస్తున్న లంచావతారులు ఏమాత్రం జంకడం లేదు. గత కొన్ని రోజులుగా అక్రమార్కులు వరుసబెట్టి ఏసీబీకి పట్టుబడుతున్నారు. తెలంగాణ ఏసీబీ ఈ స్థాయిలో విరుచుకుపడటం

మిగతా 2లో

# బై పోల్‌లో నందమూరి వారసురాలు

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక అనివార్యం

సెంటిమెంట్ హస్త్రాలను బయటకు తీస్తోన్న బీఆర్ఎస్

కంటోన్మెంట్ తరహాలో పాగా వేసేందుకు కాంగ్రెస్ కసరత్తు

బీజేపీ, జనసేనతో టీడీపీ చర్చలు

హైదరాబాద్, జూన్ 26,
తెలుగు రాజకీయాల్లో నందమూరి కుటుంబానికి ప్రత్యేక స్థానం. ఎన్టీఆర్ వారసులుగా నందమూరి హరికృష్ణతో పాటు బాలకృష్ణ రాజకీయం చేశారు. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. మరోవైపు టిడిపిలో క్రియాశీలకంగా అవుతామనుకున్న తరుణంలో నందమూరి తారకరత్న మృతి చెందారు. జూనియర్ ఎన్టీఆర్ తో పాటు కళ్యాణ్ రామ్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కానీ వారి సోదరి సుహాసిని మాత్రం యాక్టివ్ గా ఉన్నారు. తెలంగాణలో జరిగే ఉప ఎన్నికల్లో ఆమె పోటీ చేస్తారని ప్రచారం నడుస్తోంది. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. ఇప్పటికే అన్ని పార్టీలు సన్నాహాలు ప్రారంభించాయి. బిఆర్ఎస్ ఎమ్మెల్యే కావడంతో ఆ పార్టీ సెంటిమెంట్ వస్త్రాలను బయటకు తీస్తోంది. మరోవైపు కంటోన్మెంట్



తరహాలోనే ఈ సీట్లో పాగా వేయాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది.అనుకోని అవకాశంగా తెలుగుదేశం పార్టీభావిస్తోంది. వాస్తవానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి గెలిచిన మాగంటి గోపీనాథ్ తెలుగుదేశం పార్టీకి చెందినవారు. టిడిపి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్ లోకి ఫిరాయించారు. అందుకే ఉప ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి పోటీ చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. టిడిపికి మిత్రపక్షాలుగా ఉన్న బిజెపి,

మిగతా 2లో

## నేడే ఎప్‌సెట్ కౌన్సెలింగ్ తేదీలపై క్లారిటీ

మొదటి ప్రాధాన్యత వారికి మాత్రమే

పీజీఈసెట్ ఫలితాలు విడుదల

అర్హత సాధించిన 21,290మంది విద్యార్థులు

వెల్లడవ్వనున్న ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియను వివరాలు




# డ్రగ్స్ హబ్‌గా మారొద్దు

డ్రగ్స్ నివారణ కోసం కొత్తగా 'ఈగల్' ఏర్పాటు

సినీ తారల రీల్ లైఫ్ కాదు...రియల్ లైఫ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి: సీఎం రేవంత్‌రెడ్డి

ప్రభుత్వానికి తమ మద్దతు ఉంటుందన్న టాలీవుడ్




హైదరాబాద్: తెలంగాణ అంటే ఉద్యమాలు, పోరాటాల గడ్డ అని, ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమానకరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిరంతరశ్రమ, కఠోరదీక్షతోనే ఏ రంగంలోనైనా విజయం సాధించగలమని తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.పంజాబ్ ఇవాళ డ్రగ్స్ మహమ్మారి వలలో చిక్కుకున్నది : పాఠశాలలు మొదలు యూనివర్సిటీల వరకు డ్రగ్స్ ప్రభావం పడిందని, 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణపతకం రాకపోవటం గురించి ఆలోచించాలని సీఎం తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే దేశం మనుగడకే ప్రమాదమని, ఒక దేశాన్ని దెబ్బతీయడానికి శత్రుదేశాలు ఏ మార్గాన్ని ఎంచుకుంటాయో చెప్పలేమని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని దేశాలు కొవిడ్‌ను ఎంచుకోవచ్చు, కొన్ని దేశాలు డ్రగ్స్‌ను ఎంచుకోవచ్చని, యుద్ధం,

## అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డ్

చరిత్ర సృష్టించిన శుభాంశు శుక్లా

ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారతీయుడిగా రికార్డు



## పార్లమెంట్ కన్నా రాజ్యాంగమే అత్యున్నతమైంది

నాకు ఆర్కిటెక్ట్ కావాలని ఉండేది

మా నాన్న కోరికను నెరవేర్చేందుకే న్యాయవాది అయ్యాను

సీజేఐ జస్టిస్ గవాయ్‌ను సత్కరించిన బార్ సభ్యులు




## కుమ్మర్లకు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తాం

బోనాల జాతర ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్




## ఎంపీకి బెదిరింపు కాల్

భద్రత పెంపునకు నిర్ణయించిన పోలీసు శాఖ

మావోయిస్టుల నుంచి బెదిరింపు కాల్ నేపథ్యంలో ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయం



## బ్లాక్ బాక్స్ డేటా డౌన్‌లోడ్

ఢిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన దర్యాప్తులో పురోగతి సాధించింది. దిల్లీలోని ఏఏఐబీ ల్యాబ్ బ్లాక్‌బాక్స్ డేటాను విజయవంతంగా డౌన్‌లోడ్ చేసింది. ఈ మేరకు విమానయాన మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన చేసింది. సీవీఆర్, ఎఫ్‌డీఆర్ డేటాను నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీంతో బ్లాక్ బాక్స్ డేటా ద్వారా ప్రమాద సమయంలో ఏం జరిగిందనే విషయం తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడనుంది. అలాగే ప్రమాదానికి గల కారణాలు కూడా తెలుసుకోవచ్చు. భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు బ్లాక్‌బాక్స్ డేటా విశ్లేషణ ఉపకరించనుందని పౌర విమానయాన శాఖ తెలిపింది.

## అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డ్

ఢిల్లీ: భారత అంతరిక్ష చరిత్రలో వ్యోమగామి శుభాంశు శుక్లా సరికొత్త రికార్డ్ సృష్టించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో డ్రాగన్ వ్యోమనౌక అనుసంధానమయ్యే డాకింగ్ ఘట్టం విజయవంతమైంది. దీంతో శుభాంశు శుక్లా తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి జితేందర్ సింగ్ అభినందనలు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలా ఒక నిమిషానికి ఫ్లోరిడాలోని నాసా కెన్నడీ అంతరిక్ష ప్రయోగం కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లిన డ్రాగన్ వ్యోమనౌక 28గంటలు ప్రయాణించి ఐఎస్ఎస్‌కు చేరుకుంది. యాక్సియం-4 మిషన్‌కు సంబంధించిన డాకింగ్ ప్రక్రియ పూర్తయినప్పటికీ నలుగురు వ్యోమగాములు వెంటనే ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించలేదు. కొద్దిసేపు డ్రాగన్ వ్యోమనౌకలో తనిఖీలు, సర్దుబాట్లు చేశారు. ఐఎస్ఎస్, డ్రాగన్ వ్యోమనౌకలో పీడనం ఒకేతీరులో ఉండేలా వ్యోమగాములు చేశారు. లీకేజీలేమైనా ఉన్నాయా అని పరిశీలించారు. ఆ తర్వాతే శుభాంశు బృందం అంతర్జాతీయ అంతరికక్ష ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించింది.

## ఎంపీకి రఘునందర్? రావుకు బెదిరింపు కాల్

హైదరాబాద్: బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు భద్రత పెంచాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఇటీవలే రఘునందన్‌రావుకు మావోయిస్టుల నుంచి బెదిరింపు కాల్ వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసు శాఖ మెదక్ ఎంపీకి భద్రత అవసరమని నిర్ణయించింది. ఇకపై రఘునందన్‌రావు పర్యటనలో ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముగ్గురు ఎస్పీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. రఘునందన్‌రావుకు పీపుల్స్‌వార్ మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఆగంతకుడు ఫోన్ చేశాడు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునంటూ బెదిరించాడు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి ఎంపీ హాజరైన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్ పీఏ లిఫ్ట్ చేశారు. బెదిరింపు కాల్‌పై డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఉన్నతాధికారులకు రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు.

## కుమ్మర్లకు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తాం:

కుమ్మర్లకు నైపుణ్య శిక్షణ ఇప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జగదష్ మందిర్ నుంచి చేపట్టిన తెలంగాణ కుమ్మర్ల బోనాల జాతర ప్రారంభోత్సవానికి పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఆర్.కృష్ణయ్య, అనిల్ కుమార్ యాదవ్, మత్స్యకార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు హాజరయ్యారు. కుమ్మర్ల వృత్తి రక్షణకు రాబోయే కాలంలో గుజరాత్‌లో ఉన్న సాంకేతికత తెలుసుకోవడానికి ప్రతినిధులను పంపిస్తామన్నారు. వాళ్ల మాదిరిగానే ఇక్కడ కూడా శిక్షణ ఇప్పిస్తామని స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత పెరిగేలా యాంత్రీకరణ చేస్తూ శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

## నేడే ఎప్‌సెట్ కౌన్సెలింగ్ తేదీలపై క్లారిటీ

తెలంగాణ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియపై నేడు స్పష్టత రానుంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు షెడ్యూల్ వివరాలు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణ రెడ్డి తెలిపారు. గురువారం కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో పీజీ ఈసెట్ 2025 ఫలితాలు వర్సిటీ ఉపకులపతి కిషన్ కుమార్ రెడ్డితో కలిసి ఫలితాలు విడుదల చేశారు. పీజీ కోర్సుల్లో జేఈఈ, గేట్‌లో ప్రతిక్ష కనబర్చినవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌బాలకృష్ణ రెడ్డి చెప్పారు. పీజీ ఈసెట్ 2025 పరీక్షకు 25,335 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 22,938 మంది విద్యార్థులు హాజరయ్యారు. 19 విభాగాలలో కలిసి 21,290మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు బాలకృష్ణ రెడ్డి తెలిపారు. పరీక్ష రాసిన విద్యార్థులలో అర్హత శాతం సగటు 92 శాతంగా ఉంది. 19 విభాగాలకు గాను విభాగాల వారీగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థుల వివరాలను విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, పీజీ ఈసెట్ కన్వీనర్ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఎప్‌సెట్ పరీక్షలను ప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షలు పూర్తవ్వగా, మే నెల 2, 3, 4 తేదీల్లో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలను పూర్తి చేశారు. ఫార్మా, అగ్రికల్చర్ విభాగంలో 81,198 మంది విద్యార్థులు పరీక్షలకు హజరవ్వగా, ఇంజినీరింగ్ విభాగంలో 2.07 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లోని 124 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు.

# 6 నెలల్లో 122 కేసులు

ఈ మధ్యకాలంలో ఇదే మొదటిసారి.. అందుకే కేసుల సంఖ్య గణనీయంగా నమోదవుతోంది. ఏసీబీ అధికారుల సత్వర స్పందనతో బాధితుల్లో సైతం నమ్మకం కుదురుతోంది. దీంతో బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులు కూడా పెరుగుతున్నాయి. అయితే ఏసీబీ అధికారుల అధికారిక టోల్‌ఫ్రీ నంబర్ 1064తోపాటు 94404 46106 వాట్సప్ నంబరు, ఫేస్‌బుక్, ఎక్స్ లాంటి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ద్వారా కూడా ఫిర్యాదు చేసే సౌలభ్యం ఉంది. ప్రజల్లో టెక్నాలజీ వినియోగం పెరగడం కూడా ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో రావడానికి కారణంగా మారింది. సమాచారం రాగానే అధికారులు తొలుత అసలైనద కదా బాధితున్ని నిజంగానే లంచం డిమాండ్ చేశారా..! లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అని నిర్ధారించుకుంటారు. ఎందుకంటే తమకు పడని అధికారులపైనా బాధితుల ముసుగులో ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. మరోవైపు చాలా సందర్భాల్లో బాధితులే ఫోన్, వీడియో రికార్డింగులు వంటివి సమర్పిస్తున్నారు. కొంతమంది లంచావతారులైతే యూపీఐ ద్వారానే ఆమ్యామ్యాలు స్వీకరిస్తూ అడ్డంగా దొరికిపోతున్నారు. బాధితులు సమర్పించిన ఇలాంటి ఆధారాలను మరోమారు పునఃపరిశీలించిన తర్వాతే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగుతున్నారు. గతంలో ఒక ఫిర్యాదును నిర్ధారించుకొని లంచం అడిగిన ఉద్యోగిని పట్టుకోవడానికి సగటున వారం నుంచి పది రోజులు పట్టేది. ఇప్పుడది మూడు నాలుగు రోజులకు తగ్గింది. ఏసీబీకి వచ్చే ఫిర్యాదుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో అందుకు తగ్గట్టుగానే స్పందించేందుకు ఏసీబీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉండటంతో మరింత మంది సిబ్బందిని సమకూర్చుకునేందుకు ఏసీబీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

రాష్ట్రంలో ఏసీబీ దాడులు జరుగుతూ అధికారులు పట్టుబడుతున్నా.. అవినీతి అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ప్రతి పనికి ఓ రేటు కట్టి మరి లంచం మా హక్కు అన్నట్లు మితిమీరి వ్యవహరిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో తహసిల్దార్ అయితే వెయ్యి తక్కువ అయ్యాయని రైతును పీడించుకు తిన్నాడు. తహసీల్దార్ రాజారావు వసూళ్ల దందా, అంతా ఇంతా కాదు. తహసిల్దార్ కార్యాలయం కేంద్రంగా లంచం డిమాండ్, తన ఛాంబర్ లో రైతు నుండి ఐదు వేలు లంచం తీసుకుంటున్న వీడియో వైరల్ అవుతోంది. పాస్ బుక్ లో పేరు మార్పు కోసం లంచం డిమాండ్ చేసిన తహసీల్దార్ రాజారావు రైతు వద్ద ఐదు వేలు తీసుకుంటూ ఇంతేనా అంటు రైతుతో సంభాషణ, గుంటకు వెయ్యి చొప్పున ఇవ్వాల్సిందే అంటూ పట్టు బట్టాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో తన కార్యాలయమే కేంద్రంగా చేసుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు తహసీల్దార్ రాజారావు. ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలకు అందాల్సిన సేవలకు లంచం డిమాండ్ చేస్తూ తమ అవినీతి దాహాన్ని తీర్చుకుంటున్నారు. కొందరు అధికారులు అందుకు ఈ దృశ్యాలే నిదర్శనం. అశ్వాపురం మండలంలోని మల్లెల మడుగు గ్రామానికి చెందిన రైతు పాస్ బుక్ లో పేరు మార్పు కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. అందుకుగాను గత కొన్ని రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే పేరు మార్చాలంటే పైసలు ఇవ్వాల్సిందే అంటూ తాసిల్దార్ రాజారావు డిమాండ్ చేయడంతో రైతు 5000 రూపాయలు తాసిల్దార్ కు లంచం ఇచ్చాడు. అయినా తృప్తి పడని తహసిల్దార్ రాజారావ్ ఇదేంటి ఐదు వేలేనా గుంటకు వెయ్యి చొప్పున ఇవ్వాల్సిందే ఇంకో వెయ్యి కూడా పంపించు అంటూ ఆదేశించారు. దీంతో చేసేదేమీ లేక రైతు సరే పంపిస్తా అంటూ రైతు కార్యాలయం నుండి వెళ్లిపోయాడు. ప్రజలకు ఉచితంగా అందించాల్సిన సేవలకు మండల స్థాయి అధికారే లంచం డిమాండ్ చేయడంతో ఆ రైతు తన సెల్ఫోన్లో ఈ దృశ్యాలను చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ గా మారింది. లక్షలకు లక్షలు జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు బల్ల కింద చేతులు పెట్టడం మాత్రం మానడం లేదు అనేందుకు అశ్వాపురం తహసిల్దార్ రాజారావు ఘటనే ఓ ఉదాహరణ. తహసీల్దార్ వసూళ్ల దందా పై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వెంటనే బదిలీ చేశారు.

## బై పోల్‌లో నందమూరి వారసురాలు

జనసేనతో తెలుగుదేశం పార్టీ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అక్కడ అభ్యర్థిత్వంపై ఒక అంచనాకు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఈ స్థానానికి అక్టోబర్లో ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించి సెప్టెంబర్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ముందుంది. ఎలాగైనా ఈ స్థానాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. నియోజకవర్గంలో పరిస్థితుల అధ్యయనం, నిర్ణయాల కోసం పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ తో కూడిన కమిటీని సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. 2009 పునర్విభజనతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పడింది. 2014 నుంచి వరుసగా గెలుస్తూ వచ్చారు మాగంటి గోపీనాథ్. 2014లో టిడిపి నుంచి, 2018, 2023 ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి గెలుపొందారు. ఖైరతాబాద్ నుంచి విడిపోయి జూబ్లీహిల్స్ నియోజకవర్గం గా అవతరించింది. 2009లో మాత్రం కాంగ్రెస్ పార్టీ నుంచి విష్ణువర్ధన్ రెడ్డి గెలిచారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి అజారుద్దీన్, పిజిఆర్ కుమార్తె విజయా రెడ్డి, నవీన్ యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇక్కడ ముస్లిం మైనారిటీ ఓటింగ్ కీలకం. కాంగ్రెస్ ఎంఐఎం మధ్య ఒప్పందం కుదిరితే మాత్రం ఇక్కడ సమీకరణలు మారడం ఖాయం. మరోవైపు గోపీనాథ్ కుటుంబం నుంచే బిఆర్ఎస్ అభ్యర్థి పోటీ చేసే అవకాశం ఉంది. సాధ్యం కాకుంటే మాత్రం మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికి సీటు కేటాయించే పరిస్థితి కనిపిస్తోంది. అయితే తెలుగుదేశం పార్టీ మాత్రం మిగతా రెండు మిత్రపక్షాలతో కలిపి ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. అటు మాగంటి గోపీనాథ్ చంద్రబాబుకు కావలసిన మనిషి. అందుకే ఆయన మరణ సమయంలో లోకేష్ ప్రత్యేకంగా పరామర్శించారు వారి కుటుంబ సభ్యులను. తెలంగాణలో టిడిపి విస్తరణ దిశగా చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. త్వరలో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. అంతకుముందే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రూపంలో అవకాశం వచ్చింది. టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిని రంగంలో దించే పరిస్థితి కనిపిస్తోంది. టిడిపి నుంచి నందమూరి సుహాసిని బరిలోకి దించితే మంచి ఫలితం ఉంటుందని భావిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో కమ్మ ప్రాబల్యం అధికం. సామాజిక సమీకరణల దృష్ట్యా సుహాసిని అభ్యర్థిత్వం కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## బైక్‌లపై టోల్ వసూలు చేసే ఉద్దేశమే లేదు

జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు జులై 15 నుంచి టోల్ ఫీజు వసూలు చేయనుందని వస్తున్న వార్తలపై కేంద్రం క్లారిటీ ఇచ్చింది. అలాంటి వార్తల్లో వాస్తవం లేదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. టూవీలర్లకు టోల్ వసూలు చేసే ఉద్దేశమే లేదని తెలిపారు. కొన్ని మీడియా సంస్థలు ప్రజలను తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేస్తున్నాయని మండిపడ్డారు. టూ వీలర్ల టోల్ పన్నుపై పూర్తి మినహాయింపు కొనసాగుతుందన్న గడ్కరీ, వాస్తవాలు తెలియకుండా తప్పుడు వార్తలను వ్యాప్తి చేయడం సరికాదన్నారు. ఎన్‌హెచ్ఏఐ కూడా ఈ అంశంపై స్పష్టతనిస్తూ ఎక్స్ వేదికగా స్పందించింది. టూవీలర్స్‌కు టోల్ ఫీజు వసూలుపై వస్తున్న వార్తలు ఫేక్‌న్యూస్ అని స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు ఉచిత ప్రయాణం ఎత్తివేయనుందని అంతకుముందు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. జులై 15 నుంచి ఛార్జీలను వసూలు చేయనున్నట్లు తెలిపాయి. ఈ క్రమంలోనే ఈ వార్తలను ఖండిస్తూ కేంద్రం ప్రకటన విడుదల చేసింది. కాగా, ఇటీవలె హైవేలపై రాకపోకలు సాగించే వాహనదారులకు ఊరట కలిగించే శుభవార్త చెప్పింది కేంద్రం. దేశవ్యాప్తంగా హైవే ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే దిశగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. కేవలం రూ. 3వేలతో ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను తీసుకువచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులపై నిశ్చింతగా, సాఫీగా ఏడాదంతా రాకపోకలు సాగించొచ్చు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచే వార్షిక పాస్‌ల జారీ ప్రక్రియ మొదలవుతుందని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు.

## తెలంగాణ డ్రగ్స్ హబ్‌గా మారొద్దు

సైనికులు అంటేనే పంజాబ్ గుర్తుకువచ్చేదని, అలాంటి పంజాబ్ ఇవాళ డ్రగ్స్ మహమ్మారి వలలో చిక్కుకున్నదని తెలిపారు. డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ అంటే ఐటీ, ఫార్మా రంగాలకు ప్రాచుర్యం పొందిందని, ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ డ్రగ్స్ హబ్‌గా మారొద్దని అన్నారు. హైదరాబాద్ అంత ఉన్న దేశాలు ఒలింపిక్స్‌లో పదులకొద్దీ పతకాలు సాధించాయని, క్రీడల ప్రోత్సాహం కోసం చాలా దేశాల్లో అధ్యయనం చేశామని గుర్తు చేశారు. హీరోల సినిమా పాత్రలనే కాదు వారి నిజజీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన బాధ్యత పౌరులందరిపై ఉందని సీఎం అన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ కనిపిస్తే యాజమాన్యాలు బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. పిల్లల ప్రవర్తనను గమనించేందుకు ప్రత్యేకమైన సిబ్బందిని నియమించుకోవాలని, విద్యాసంస్థల్లో బిహేవియర్ అబ్జర్వర్స్‌ను నియమించుకోవాలని తెలిపారు. గంజాయి అమ్మేవారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, డ్రగ్స్ నివారణకు ప్రత్యేకంగా 'ఈగల్' అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని, గంజాయి పంట, సరఫరా, విక్రయంపై 'ఈగల్' టీమ్ నిఘా పెడుతుందని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ నిరోధానికి ఈగల్ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈగల్ లోగోను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఇకపై రాష్ట్రంలో ఎక్కడన్నా గంజాయి సాగు చేస్తే పసిగట్టేలా ఈగల్ టీమ్‌కు శిక్షణ ఇవ్వనున్నారు. డ్రగ్స్ నష్టాలపై యువతకు అవగాహన కల్పించడం గొప్ప విషయమని నటుడు రాంచరణ్ తెలిపారు. చిన్న పిల్లలు తినే చాక్లెట్లలో కూడా మత్తుపదార్థాలు కలపడం దారుణమని, పిల్లలకు చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు కొనివ్వాలంటే భయపడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, స్నేహితులతో గడిపితేనే ఎక్కువ సంతోషంగా ఉంటుందని, వ్యవస్థలోని చెత్తను శుభ్రం చేసేందుకు ప్రభుత్వానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. వారికి దూరంగా ఉండాలి : డ్రగ్స్ సమస్య ఎంత తీవ్రంగా ఉందో ఇప్పుడిప్పుడే అర్థమవుతోందని, డ్రగ్స్ బారిన పడితే పరిస్థితి ఎలా ఉంటుందో పోలీసులు వివరించారని నటుడు విజయ్ దేవరకొండ తెలిపారు. ఆరోగ్యం బాగా లేకుంటే ఎంత సంపాదించినా వృథా అని, ఒక్కసారి డ్రగ్ ప్రయత్నించి చూడు అనే వారికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు కోరుకున్నది సాధించడంలోనే ఎక్కువ కిక్కు ఉంటుందని యువతకు ఉద్బోధించారు.

## పార్లమెంట్ కన్నా రాజ్యాంగమే అత్యున్నతమైంది

మహారాష్ట్ర: దేశంలో పార్లమెంటే సుప్రీం అని చాలామంది భావిస్తుంటారని, కానీ తన దృష్టిలో మాత్రం రాజ్యాంగమే అత్యునతమైనదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. రాజ్యాంగం పరిధిలోనే భారత ప్రజాస్వామిక వ్యవస్థకు చెందిన శాసన, న్యాయ, కార్యనిర్వాహక శాఖలు పనిచేస్తాయన్నారు. రాజ్యాంగంలో సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ, దాని మౌలిక స్వరూపాన్ని పార్లమెంటు మార్చలేదని చెప్పారు. గతంలో ఈమేరకు సుప్రీంకోర్టు ఒక తీర్పు ఇచ్చిన విషయాన్ని సీజేఐ గుర్తు చేశారు. గత నెలలోనే భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన సీజేఐ గవాయ్‌ను మహారాష్ట్రలోని అమ్రావతి బార్ అసోసియేషన్ సత్కరించింది. ఈ కార్యక్రమంలో సీజేఐ బీఆర్ గవాయ్ ప్రసంగిస్తూ న్యాయమూర్తుల పనితీరు, తన లా కెరీర్‌తో ముడిపడిన పలు కీలక విషయాలను వివరించారు. అధికారంతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయనే విషయాన్ని జడ్జీలు గుర్తుంచుకోవాలని సీజేఐ అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులను వెలువరించినంత మాత్రాన ఒక జడ్జీ స్వతంత్రుడు కాలేడని ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల భావనకు అనుగుణంగా స్వతంత్రంగా తీర్పులను వెలువరించాలని జడ్జీలకు సీజేఐ బీఆర్ గవాయ్ సూచించారు. తాను ఇప్పటివరకు ఇచ్చిన తీర్పులన్నీ ఇదే కోణంలో ఉంటాయన్నారు. ప్రజలపై బుల్డోజర్ చర్యలకు వ్యతిరేకంగా తాను తీర్పు ఇచ్చానని, నిలువ నీడ పొందే ప్రజా హక్కునే పరమావధిగా పరిగణించానని సీజేఐ తెలిపారు. బాల్యంలో తాను ఆర్కిటెక్ట్ కావాలని అనుకునేవాడినని, కానీ న్యాయవాది కావాలని తన తండ్రి దాదాసాహెబ్ గవాయ్ కోరుకునే వారని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి దాదాసాహెబ్ గవాయ్ కూడా న్యాయవాది కావాలని భావించారని, అయితే అప్పట్లో స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన అరెస్టయ్యారని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ చెప్పారు. లాయర్ కావాలనే తన తండ్రి కోరికను నెరవేర్చినందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తన తల్లి కూడా ఉండటం సంతోషాన్ని కలిగిస్తోందని, అయితే తాతగారిని చాలా మిస్ అవుతున్నానని ఆయన తెలిపారు.

# జర్నలిస్టుల నిరాహార దీక్షలు

## ప్రశ్నించే గొంతుకపై మీ ప్రతాపమా

-జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే ఉద్యమం ఆగదు
జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి
-ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై మీ ప్రతాపమా




మనప్రజాప్రతినిధి//కొల్లాపూర్ న్యూస్:రెండవరోజు కొనసాగుతున్న జర్నలిస్టుల నిరాహార దీక్ష. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించకుంటే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తాం జిల్లా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కారం చేయకుంటే భజరంగ్దళ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జరుగుతున్న జర్నలిస్టుల రిలే నిరాహారదీక్షలు రెండవ రోజుకు చేరుకున్నాయి రెండవరోజు దీక్షలను టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు తాటికొండ కృష్ణ ప్రారంభించారు ఈదీక్షలోటిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అద్యక్షులు రామచంద్రం నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి,టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున సీనియర్ జర్నలిస్టులు బచ్చల కూర కురుమయ్య సిపి నాయుడు రమణ రామకృష్ణ వెంకటరాములు శివ కేశవులు గోవిందు స్వాములు తరుణ్ మల్లేష్ తదితరులు దీక్షలో కూర్చున్నారు దీక్ష శిబిరానికి సంఘీభావంగా బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న బిఎస్పీ జిల్లా కోశాధికారి బంకలిదాసు, జిల్లా నాయకులు కళ్యాణ్, ముని స్వామి మరియు వాసవి క్లబ్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, బిఆర్ ఎస్వి శేఖర్, రైతుసంఘం నాయకులు భజరంగ్దళ్ నాయకులు పులిభరత్,బాలు వాసవిక్లబ్ బిఆర్ ఎస్, ఎస్సి సెల్, ఎన్జీవో సంఘాలుమద్దతు ప్రకటించారు.

# ఎన్ సి సి క్యాడెట్లు అవగాహన

## విద్యార్థి జీవితాన్ని వృధా చేసుకోవద్దు








మనప్రజాప్రతినిధి//సిద్దిపేట:సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ ఎన్ సి సి యూనిట్ అధ్వర్యంలో... అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడడం వల్ల జరిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, విలువైన జీవితాన్ని కోల్పోవడం, కుటుంబం అనేక ఇబ్బందుల పాలవ్వడం, ఇంకా ఎంతో విలువైన యవ్వనాన్ని, విద్యార్థి జీవితాన్నీ వృధా చేసుకోవడం గురించి ఎన్ సి సి క్యాడెట్లు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. సునీత, వైస్ ప్రిన్సిపాల్ డా. పి. అయోధ్య రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డా. గోపాల సుదర్శనం, ఎన్ సిసి కేర్ టేకర్ బి కృష్ణయ్య మరియు ఎన్ సి సి క్యాడెట్లు పాల్గొన్నారు.

# బీసీల బతుకులు మారేది ఎప్పుడు?



మనప్రజాప్రతినిధి//తెలంగాణ: మనదేశం ప్రజాస్వామ్య దేశం.ప్రజలచేత ప్రజల కొరకు ఎన్నుకునే అవకాశం ప్రజాస్వామ్యానికి మాత్రమే ఉంది.మనకు స్వాతంత్ర్యం వచ్చి 75సం"వచ్చిన బిసిల బతుకులు పెద్దగా మార్పు చెందలేదు.కారణం చదువు లేకపోవటం, ఐక్యత లేకపోవడం ఒకరి నాయకత్వం విశ్వాసం లేకపోవడం,సమాజం సరియైన అవగాహన లేకపోవడం.ఆర్థికంగా లేకపోవడం, ప్రశ్నించే తత్వం లేకపోవడం,ముందు చూపు లేకపోవడం ఇవన్నీ కారణాలు.6-8శాతం ఉన్న అగ్రవర్ణ కులాల వారు ఆరోజు నుంచి ఈ రోజు వరకు రాజీకీయ పదవులు వాళ్ళు పొందుతూ ఉన్నారు.వారిలో ఐక్యత ఎక్కువగా ఉంటుంది.వాళ్ళు వేరు వేరు రాజకీయ పార్టీలో ఉన్న ఒకరికి ఒకరు సపోర్టు చేసుకుంటారు.గెలుపు దిశగా ప్రయత్నాలు చేస్తారు.వాళ్ళు ఒకరిపై పూర్తి విశ్వాసంతో ముందుకు వెళ్ళుతుంటారు.బిసిల ఐక్యతను విడగొట్టి మనబలహీతను వారి బలంగా మలుచుకుంటారు. అగ్రవర్ణ పార్టీల జెండాలు మోసేది బిసిలు.బ్యనర్లు కట్టేది బిసిలు.మానాయకుడు వచ్చాడని నినాదాలు చేసేది బిసిలు.నాయకుని ముందు బాణాసంచా కాల్చేది బిసిలు.అయిన రాజకీయ పదవులు బిసిలకు రావు . అగ్రవర్ణాలవారిని రాజకీయ పదవులు పొందేందుకు నిచ్చెన మెట్లుగా వాడుకుని పదవులు పొంది.సీట్లో కూర్చొని చిన్న చిన్న పదవులకే బిసిలను పరిమితం చేసి వాళ్ళ చెప్పుచేతల్లో పెట్టుకుంటారు.వాళ్ళు కుక్కకు బొక్క వేసినట్లుగా అధికార పదవులు వాళ్ళు చేతిలో పెట్టుకొని చిన్న చిన్న అనధికార పదవులు మన బిసిలకు ఇస్తారు.ఈరోజు మన తెలంగాణ లో దాదాపుగా 100పైగా బిసి కులాలు ఉన్నాయి.మరి ఈరొజు బిసి యం.ఎల్.ఏలు,ఎంపిలు ఎంతమంది ఉన్నారు.జనాబాఎకగమ దామాషా ప్రకారంగా మన బిసిలకు న్యాయం జరిగిందా ఒకసారి ఆలోచన చేయాలి.దాదాపుగా 20-30సం"నుంచి కొన్ని బిసి సంఘాలు ఉద్యమాలు చేయడం ద్వారా కొంత మార్పు జరిగినది.అలాగే ఈమధ్య కాలంలో బిసి సంఘాలు ఎక్కువైనాయి ఎవరి పంథాలో వారు బస్సుయాత్ర, పాదయాత్ర, నిరాహారదీక్షలు, చేయుట ద్వారా మరియు సోషియల్ మీడియాలో బిసి నాయకుల మీటింగ్ లు,అవార్నెస్ చేయుట ద్వారా కొంత మార్పు ఈ సమాజంలో ఈమధ్య కాలంలో చూస్తున్నాం.ఇప్పడైనా బిసి సంఘాలన్నీ జేఏసిగా ఏర్పడి ఐక్యంగా ఉండి ఉద్యమించాలి.ప్రజలలో ఇంకా మార్పు రావాలంటే ప్రొఫెసర్ ద్వారా అవగాహన కలిగించాలి.సభలు సమావేశాలు ఏర్పాటు చేయాలి.బిసిలు ఎన్నికలో పోటీ చేసిన జిగురు కప్పిన నిప్పులా బయటకు కనబడకుండా ఇనర్ గా ఉండి ఓట్లు వేసి సీట్లో కూర్చొబెట్టాలి.అనాడే చెప్పిందు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఏకులం అయితే రాజ్యాధికారం చేయదో ఆకులం ఆర్థాకాబివృద్ధిని సాధించలేదని ఏనాడో చెప్పాడు.బిసిలు అనాది కాలం నుండి ఈరోజు వరకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, వ్యాపారం గా,విద్య, ఉద్యోగ పరంగా వెనుకబడి పోయాం.ఇప్పటికైనా మొద్దు నిద్రను వీడండీ.బిసిల అభ్యున్నతికి పాటు పడండి.ఇంతకాలం రాజ్యాంగ మనకు హక్కులు కల్పించిన మన అమాయకత్వం తో వాటిని పొందలేదు.వాటిద్వారా ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం చేయలేదు.. ఇప్పటికైనా నిజాలను తెలుసీకోండీ బిసి బతుకులు మార్పు చెఃదుటకై ప్రతి బిసి బిడ్డ కంకణం బద్దులైమన బిసి హక్కులకోసం పోరాడాలి.చదువుకున్న యువత సమాజంలో చాలా మందికి అవగాహన చేసేవిధంగా వివరించాలి మనం కోల్పోయిన వాటి గురించి భవిష్యత్తు తరాలు వారికి జరిగే ఇబ్బందుల గురించి అవగాహన కలిగించాలి.నాయకులు బిసి సమాజాన్ని చైతన్యం చేయాలి.మనబిసి బిడ్డలు ఏఎన్నికలో పోటీచేసిన వారికే మన బిసిలంతా గంప గుర్తుగా ఓట్లు వేసే విధంగా మోట్ వేషన్ చేయాలి.విజ్ఞాన వంతులు బిసిలకు మేలు జరిగే జీవోలు,చట్టాలు, సెక్షన్లు సమాజానికి తెలియజేయాలి.ఈవిధంగా ప్రతిబిసి బిడ్డ బిసిల మార్పుపై పోరాడాలి అపుడే బిసిల బతుకులు మారుతాయి.రాజ్యాదికారం పొందుతారు.అందరికీ చైతన్యం వచ్చింది అందుకే ముక్తకంఠంతో నినదిస్తున్నారు అదేమంటే బిసిలకు రాజ్యాధికారం రావాలని మరియు వారి బతుకులు మారాలి.ఈమార్పులో అందరు భాగస్వాములు కావాలి.దీనికోసం అందరు సహాకరించాలని కొరుకుంటు. డా.మాచర్ల మధుసూధన్ గౌడ్. గౌడ సంఘం రాష్ట్ర నాయకులు.బీసీ ఏఫ్ నాగర్ కర్నూల్ జిల్లా అద్యక్షులు

# కళాకారులకు

## ఉద్యోగం కళ ఎప్పుడు నెరవేరుతుంది

-పాటల పల్లకిని విజయవంతం చేద్దాం
ఉద్యోగాలను సాధించుకుందాం
-తెలంగాణ ఉద్యమ కవి గాయకులు నేర్నాల కిషోర్




మనప్రజాప్రతినిధి//ఉమ్మడి మెదక్ జిల్లా:ఉమ్మడి మెదక్ జిల్లా పాటల పల్లకిలో 12 గంటల కార్యక్రమానికి సన్నాహక సమావేశాన్ని సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ఉద్యమ కవి గాయకులు మద్దెల నర్సింలు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమ కవి గాయకులు నేర్నాల కిషోర్ మాట్లాడుతూ.తెలంగాణ ఉద్యమంలో గోసి గొంగడేసి పల్లె పల్లెల ప్రజలను చైతన్యం చేసి రాష్ట్ర సాధనలో కీలకంగా పనిచేసిన అర్హులైన ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు రాకపోవడం చాలా బాధాకరమని ఇప్పుడైనా ఈ ప్రభుత్వం ఉద్యమ కళాకారులకు సారథిలో ఉద్యోగాలు కల్పించాలన్నారు.అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో సభను నిర్వహిస్తున్న తరుణంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏర్పాటు చేయడానికి సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఉద్యమ కళాకారులందరూ ఏకతాటిపై కదిలి పాటల పల్లకిలో 12 గంటలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు ఉమ్మడి మెదక్ జిల్లాలో జరగబోయే పాటల పల్లకి కార్యక్రమాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు కార్యక్రమంలో టి పి సి సి సాంస్కృతి సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు, తెలంగాణ జానపద కళాకారుల సంఘం సిద్దిపేట అధ్యక్షుడు కళా ప్రసాద్ , ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బండ కాడి గణేష్,ఉద్యమ కళాకారుల సంఘం మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లిపూర్ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల స్వామి, సంగారెడ్డి జిల్లా ఉద్యమ కళాకారుడు ఆరెళ్ళ రాము,కళ్ళెం లక్ష్మణ్,సిరియాల్, ప్రశాంత్, రమేష్, రాకేష్, దప్పు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కొమ్మూరి తోనే

మనప్రజాప్రతినిధి//చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం చేర్యాల మండలం ఆకునూర్,కాశ గుడిసెల గ్రామాలలో జనగామ డిసిసి అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.ఆకునూర్ గ్రామానికి చెందిన తాటికొండ రాములు,ఎండి పర్వీన్, షేక్ అజ్రత్,లకు అరవై ఐదు వేల రూపాయల చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేర్యాల మండల అధ్యక్షులు కొమ్మురవి, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు మంజ మల్లేశం, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు చేర్యాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భూమని



బాలరాజు, ఆకునూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజు, ఇతర కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

# సొంతింటి కల

-మండల్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మొజామిల్
-ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేసిన కాంగ్రెస్ నాయకులు




మనప్రజాప్రతినిధి//చేగుంట జూన్ 26 :చేగుంట మండల్ చందాయిపెట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మండల్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ ముజామిల్,మండల్ హౌసింగ్ ఏ ఇ, రియాజుద్దీన్, పంచాయతీ సెక్రెటరీ కృష్ణ, ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి,ముగ్గులు పోసి శంకుస్థాపన చేసిన కాంగ్రెస్ నాయకులు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం చాలా సంతోషకరం ఉందని, గత ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టకపోవడంతో,ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించడం జరిగిందిఅని అన్నారు, అందుకుగాను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట, ప్రతి పథకం ప్రజల వద్దకే వెళుతుందిఅని అన్నారు ఇందిరమ్మ ఇండ్ల , మా గ్రామానికి 30 మంజూరు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ తరుపున సోనియా గాంధీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి మెదక్ జిల్లా నూతన మంత్రివర్యులు వివేక్ కు,దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డికి, కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో, మండల ఏఈ, మహమ్మద్ రియాజ్, గ్రామ కార్యదర్శి కృష్ణ, ఇందిరమ్మ కమిటీ, మెంబర్స్, పబ్బ నగేష్ గుప్తా, బైండ్ల శివరాజయ్యా, అచంపేట్ పద్మ స్వామి, బాసరాజు, ఉప్పరి సిద్ధిరాములు, అచంపేట్ యాదగిరి, ఎల్లమేశ్వర్, చితబోయిన రాములు,నర్సింలు, స్వామి,అవుబోతు మల్లేష్,లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు,

# కరెన్సీ పై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

## -ప్రధానికి లక్ష పోస్ట్ కార్డ్ పంపిస్తా -డా.జేరిపోతుల పరశురామ్



మనప్రజాప్రతినిధి//చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆర్బీఐ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని కరెన్సీ పై అంబేద్కర్ సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్. జేరిపోతుల పరశు రామ్ దేశవ్యాప్త లక్ష పోస్ట్ కార్డ్ ఉద్యమాన్ని ఈనెల ఇరవై మూడు న ఉస్మానియా యూనివర్సిటి ఆర్ట్స్ కళాశాల నుండి ప్రారంభమై ఈరోజు సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రం డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది దళిత బహుజన సంఘాల నాయకులు స్వాగతం పలికి ఈ అంబేద్కర్ విగ్రహానికి పువ్వుల మాల వేసి ఈ సందర్బంగా కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశు రామ్,మాట్లాడుతూ1921లో ఇంపిరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు డా.బి ఆర్ అంబేద్కర్ రూపాయి దాని సమస్య పరిస్కార మార్గం అనే పుస్తకాన్ని వ్రాసి హిల్టాన్ యాంగ్ కమిషన్, రాయల్ కమిషన్,సైమన్ కమిషన్ బ్రిటిష్ ప్రభుత్వానికి ఇవ్వడం వల్ల ఇది వాస్తవం అని గ్రహించి 1935 ఏప్రిల్ 1 రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా ఏర్పడ్డది అంటే నాడు అంబేద్కర్ లేకుంటే నేడు అర్బీఐ లేదుఅని అన్నారు జిల్లా వ్యాప్తంగా ఐదువందల మంది తో పోస్ట్ కార్డ్స్ పోస్ట్ భాక్స్ లో వెయ్యడం జరిగింది జాతీయ జండా రూపాకల్పన కమిటీ ఏర్పడ్డరోజు జాతీయ జండాలో అశోక చక్రం పెట్టిన రోజు జూన్ 23 నుండి 26 జనవరి 2026 వరకు దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కి లక్ష మంది తో పోస్ట్ కార్డ్ ఉద్యమం జరుగుతుందని అన్నారు ఈయొక్క కార్యక్రమం లో కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జిల్లా కన్వీనర్ మేడిపల్లి చందు,చేర్యాల మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మంగోలు చంటి,వీరన్న పేట మాజీ సర్పంచ్ వల్లూరి శ్రీనివాస్, మాల మాహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బుట్టి. సత్యనారాయణ, ప్రసాద్, భూమిగారి రాజేందర్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




## -ఎస్ ఐ శ్రీ చైతన్య కుమార్ రెడ్డి

మనప్రజాప్రతినిధి//మెదక్‌జిల్లా చేగుంట జూన్ 26: మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చేగుంట పట్టణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల నుండి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్బంగా ఎస్సై మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను, విస్తృతంగా, ప్రచారం చేయాలని, మత్తు పదార్థాల,వినియోగం, రవాణాపై అప్రమత్తంగా, ఉంటూ నిరోధానికి సంఘటిత కృషి అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీరజ, ఏఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ షరీఫ్, రవీందర్ గౌడ్, నాయుడు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు రఘుపతి, చల్ల లక్ష్మణ్, రావుల వెంకటేష్, సురేందర్, శారద, అంగన్వాడీ టీచర్లు రేణుక, పద్మ, సుగుణ, స్వర్ణలత, శ్రీవాణి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

# మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన




మనప్రజాప్రతినిధి//ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం మాదకద్రవ్యాల నిర్ములన అవగాహన ర్యాలీని ప్రారంభించిన పోలీస్ కమిషనర్ మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కారించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీలో మమత మెడికల్ కాలేజ్ , హార్వేస్ట్ కాలేజ్, ఎస్ ఆర్ %డ% జిజిఎన్ ఆర్ ఐ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు. మమత రోడ్డు లో గల టాటా మోటార్ సర్వీస్ సెంటర్ నుండి లకారం ట్యాంక్ బండ్ వరకు సాగిన ఈ ర్యాలీ ని అడిషనల్ కలెక్టర్ (స్దానిక సంస్థల ) డాక్టర్ పి. శ్రీజతో కలసి పోలీస్ కమిషనర్ జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించారు. మత్తుపదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదని విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి , యాంటి డ్రగ్స్ సోల్జర్ గా సైన్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ యువత పురోగతికి, భావి జీవితానికి అవరోధంగా నిలుస్తూన్న మాధకద్రవ్యాలను సమాజం నుండి సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని విజ్ఞప్తి చేశారు.దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువత అని, అలాంటి యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు బానిసలై అనారోగ్యం పాలవుతూ బంగారు భవిష్యత్తును కోల్పోవడమే కాకుండా, ఎన్నో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేస్తూ తమ చేతులారా భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, దానికోసమే ముందుగానే మత్తు పదార్థాలను నిర్మూలించి యువతను మత్తు అనే మహమ్మారి నుండి కాపాడుకోవాలని సూచించారు. జిల్లాలోగంజాయి, డ్రగ్స్ నిర్ములనకు జిల్లాలోని కళాశాలలో, పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని ఉపాధ్యాయులకు, యాంటీ డ్రగ్ కమిటీలకు, డయల్ 100,1908, పోలీస్ వారికి అందించాలని సూచించారు.అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ..సరదా కోసం మొదలైన అలవాటు.. మత్తులోకి నెడుతోందని, గతంలో సిగరెట్, మద్యంతో సరిపెట్టుకునే యువత.. ఇప్పుడు నిషా కోసం గంజాయి, మాదకద్రవ్యాల బారినపడి మత్తుకు బానిసలవుతున్నారని అన్నారు. సమాజంలోని మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలని అన్నారు. తల్లిదండ్రులు నమ్మకంతో ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా%డ%ఆర్డర్ ప్రసాద్ రావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అధికారి రాంగోపాల్ రెడ్డి , డాక్టర్ నీతీశ్, ఇన్స్‌పెక్టర్లు భానుప్రకాశ్, కరుణాకర్, స్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఆకస్మికంగా తనిఖీ అనురాధ,ఐపిఎస్



-చేర్యాల, మద్దూర్ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, ఐపిఎస్.

మనప్రజాప్రతినిధి//సిద్దిపేటజిల్లా: జనగామ నియోజకవర్గం చేర్యాల పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ల చుట్టూ పరిసర ప్రాంతాలను,మరియు సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డ్, రైటర్ రూమ్ పరిశీలించారు. మరియు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.పోలీస్ స్టేషన్లో వివిధ కేసులలో ఉన్న వాహనాల యొక్క అడ్రస్ తెలుసుకుని సంబంధిత యజమానులకు త్వరగా అప్పగించాలని సంబంధిత ఎస్ఐలకు సూచించారు,బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.త్వరలో జరుగు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఇసుక,జూదం,పిడిఎస్ రైస్,అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేయాలని సూచించారు.పోలీస్ సిబ్బంది యొక్క సమస్యలు అడిగి తెలుసుకుని ఏవైనా సమస్యలు ఉంటేనే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.పోలీస్ అధికారులు సిబ్బంది క్రమశిక్షణతో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నీతి నిజాయితీగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.పాత నేరస్తులైన కేడీలు, డీసీలు, సస్పెక్ట్ లను తరచుగా తనిఖీలు చేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎసిపి సదానందం, చేర్యాల సిఐ శ్రీను,ఎస్ఐ నిరేష్, మద్దూర్ ఎస్ఐ షేక్ మహబూబ్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్లు శ్రీధర్ గౌడ్,కోర్టు మానిటర్ ఎస్ఐ రాజేష్, మరియు ఏఎస్ఐ సదాశివరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, నరేందర్, నాగిరెడ్డి, జనార్ధన్, పోలీస్ స్టేషన్ల సిబ్బంది, సీసీ నితిన్ రెడ్డి, పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రాయింగ్ పోటీలలో హారిక ప్రథమ స్థానం




మనప్రజాప్రతినిధి/మానకొండూర్ తేదీ 26 జూన్ :మాదకద్రవ్యాల నివారణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో గోకులకొండ హారిక ప్రథమ స్థానంలో నిలిచింది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మండల కేంద్రంలోని వాణి నికేతన్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న వెంకట్రావు పల్లె గ్రామానికి చెందిన హారిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ జా, ఎస్పీ మహేష్ బిగితే చేతుల మీదుగా అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా హారిక కు ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్, పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీ నిధులతోపాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు

# సమ్మెను జయప్రదం చేయండి



మనప్రజాప్రతినిధి//దినపత్రిక, చేర్యాల,జనగామ: జనగామ నియోజకవర్గం చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సి ఐ టి యు జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ మాట్లాడుతూ నరేంద్ర మోడీ సర్కార్ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు లో భాగంగా జూలై తొమ్మిది న జరిగే సమ్మె గురించి సి ఐ టి యు, ఆధ్వర్యంలో అధికారులకు సమ్మె నోటీసులు

## -సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్ప కాయల శోభ





ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఇప్ప కాయల శోభ మాట్లాడుతూ కార్మికోద్యమం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటు న్నదని,పాలకవర్గం మరింత దూకుడుగా,దారుణంగా వ్యవహారిస్తున్నదన్నారు. సంఘటిత, ఐక్య కార్యక్రమాల్లో పాల్గొనడానికి కార్మిక వర్గానికి ఉన్న ప్రజాస్వామ్య హక్కులను క్రమంగా మోదీ సర్కారు తొలగిస్తున్నదన్నారు. కార్మిక వర్గాన్ని నిరాయుధులుగా, నిస్సహాయులుగా చేయటమే బిజెపి ప్రభుత్వం యొక్క ముఖ్యలక్ష్యంగా పనిచేస్తూందన్నారు. ఇరవై తొమ్మిది కార్మిక చట్టాలను రద్దు చేసి,వాటి స్థానంలో నాలుగు కార్మిక కోడ్ లను తీసుకువచ్చి,వాటిని అమలు చేసే ప్రయత్నం ముమ్మరం చేస్తోందని, కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. సహజ మరియు ప్రజా వనరులను పెట్టుబడిదారులు దోచుకోవటానికి,వారి లాభాలను గరిష్టంగా పెంచుకోవటం కోసం కార్మికులను తీవ్ర దోపిడీకి గురి చేస్తుందని ఆమె అన్నారు. నేటికైనా కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జూలై తొమ్మిది న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె కార్మిక వర్గం పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, మండల కన్వీనర్ రేపాక కుమార్,ఎం డి.నుర్ బి, తుప్పతిరాజు, తదితరులు పాల్గొన్నారు

# మాదక ద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహన

**-మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మనల్ని కన్న తల్లి దండ్రులు మచి పేరు తేవాలి...ఇన్చార్జి ప్రిన్సిపాల్ దేవయ్య**

**-చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్యం పెట్టుకొని సాధన వైపు ప్రయత్నం చేయాలి- సకాలాజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ సంజీవ్ కుమార్**

**- డ్రగ్స్ నివారణ తోనే దేశ యువత పురోగతి - ఏఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ దరిపల్లి నగేష్**




మనప్రజాప్రతినిధి//సిద్ది పేటజిల్లా: ప్రపంచ మాదక ద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల కొ- ఎడ్యుకేషన్, సిద్ధిపేట ,యన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో కలశాల నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ తో ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది అనంతరం కలశాలలో విద్యారులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఇందులో



భాగంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ దేవయ్య గారు మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ కన్న తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన సైకాలజిస్ట్ ,మోటివేషనల్ స్పీకర్ బి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడే వారితో మరియు వారు ఉన్న ప్రదేశం లో కూడా ఉండకూడదని ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకొని ఆ లక్ష్యం నెరవేరే వరకు ప్రయత్నం కొనసాగించాలని, అలాగే మన చుట్టూ పక్కల ఎవరైనా డ్రగ్స్ తీసుకునే వారు ఉంటే వారితో స్నహంగా ఉంటూ మార్చే విధంగా ప్రయత్నం చేయాలని ఈ రోజుల్లో డ్రగ్ మహమ్మారి వివిధ రూపాల్లో విస్తరిస్తుంది అని చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు విద్యార్థి దశ చాలా కీలకమైందని ఈ సమయంలో చెడు అలవాట్లకు దూరంగా ఉన్నట్లయితే భవిష్యత్తు చాలా బాగా ఉంటుందని తెలిపారు ఎవరైనా డ్రగ్ అలవాటయి ఉన్నట్లయితే వారికి ప్రభుత్వము తరుపున కౌన్సిలింగ్ సెంటర్స్ ఉన్నాయని వారిని కౌన్సిలింగ్ చేసి డ్రగ్ మానే విధంగా ప్రయత్నాలు చేయాలని ఈ బాధ్యత ప్రస్తుతం ఉన్న విద్యార్థుల పైన ఉందని తెలిపారు అనంతరం యన్ యన్ ఎస్ కో ఆర్డినేటర్ దరిపల్లి నగేష్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనీ మన దేశ భవిష్యత్తు నేటి యువత పై ఆధార పడి ఉందని మత్తు పదార్థాల రవాణా చేసిన నేరం అవుతుంది అని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు...ఈ కార్యక్రమములో స్టూడెంట్ కౌన్సిలర్ సీ హెచ్ కనకచంద్రం ,సీనియర్ అధ్యాపకులు సుధాకర్ రెడ్డి, వెంకట రమణ, రాజ్యలక్ష్మి ,కొమురయ్య, నరేందర్ రెడ్డి, గంగాధర్ , అశోక్, శ్రీనివాస్ రెడ్డి శ్రీకాంత్, ఫాతిమా ,ప్రసాద్, సత్యనారాయణ, విజయ్ భాస్కర్, రాజా శేఖర్,శ్రీనివాస్, చక్రవర్తి, విఠల్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేలంపాట





మనప్రజాప్రతినిధి//కొత్తగూడెం జిల్లా :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖలోని వివిధ విభాగాలకు సంబందించి నిరూపయోగంగా ఉన్న వస్తువులను ది.26.06.2025 (గురువారం) నాడు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ హేమచంద్రాపురం నందు బహిరంగ వేలంపాట ద్వారా విక్రయించడం జరిగింది. ఈ వేలంపాటలో కంప్యూటర్ మానిటర్లు, సిపియు లు, కీబోర్డులు,మౌస్లు, యుపిఎస్ లు,ట్యాబ్ లు,యాపిల్ ఐ ప్యాడ్ లు,ఇన్వర్టర్ మరియు ఇన్వర్టర్ బ్యాటరీలు, డ్రాగన్ లైట్లు,టార్చ్ లైట్లు, క్లోత్ టెంట్లు,టేబుళ్లు,కుర్చీలు,బీరువాలతో పాటు ఇతర ఫర్నీచర్ సామాగ్రిని మరియు ఇతర వస్తువులకు వేలంపాట నిర్వహించారు. ఇట్టి వేలంపాటకు సంబంధించి జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఒక కమిటీని నియమించడం జరిగింది. కమిటీ చైర్మన్ గా డిఎస్పీ మల్లయ్య స్వామి,సభ్యులుగా ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,ఏవో మంజ్యా నాయక్, ఆర్ఐ అడ్మిన్ లాల్ బాబు,ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు,కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు లు నియామతులయ్యారు. ఈ కమిటీ సమక్షంలో జరిగిన ఈ బహిరంగ వేలంపాటలో అన్ని వస్తువులను 3,07,100/- రూపాయలకు ఆసక్తి గల సభ్యులు చేజిక్కించుకోవడం జరిగిందని తెలిపారు.

# రైతును రాజును చేయడమే కాంగ్రెస్ లక్ష్యం




మనప్రజాప్రతినిధి//సిద్ధిపేటజిల్లా: ఇంకా చాలా రంగాలలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇవన్నీ కేవలం కాంగ్రెస్ హయాంలోనే సాధ్యమయ్యాయి. బి ఆర్ ఎస్ పాలనలో "రైతు బంధు" పేరుతో అరకొర నిధులు ఇచ్చారు కానీ వడ్డీ లేని రుణాలు, డ్రిప్పు-స్ప్రింక్లర్లు, బోనస్‌లు, నష్టపరిహారం అన్నీ నిలిపివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో.. 21,000 కోట్ల రైతు రుణమాఫి 9రోజుల్లో 9,000 కోట్లు రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా రూపంలో జమ ఇది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వమే చేయగలిగింది. రైతుల పండుగకు కారణమైన ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించండి రైతును రాజు చేయడమే మా కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని అన్నారు ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు బాగు శ్రీకాంత్ యాదవ్ మ్యాక రజనీకాంత్ మ్యాకల నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**-రైతులను రాజును చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదే**
**-ఎర్రబోలు రాజా రెడ్డి**
**-సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రటరి.**
**సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీక్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ వ్యవసాయం అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటేవ్యవసాయం.**
**ఇది చరిత్ర పుటల్లో చిరస్థాయిగా మిగిలిపోయే సత్యం - ఉచిత కరెంట్ - పండించిన పంటలకు మద్దతు ధర**
**- రైతులకు రుణాలు - ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం**

# సైబర్ క్రైమ్ నేరస్తుడి అరెస్ట్




మనప్రజాప్రతినిధి//జనగావం: జనగావం నియోజకవర్గం,చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో సైబర్ క్రైమ్ చేసిన నేరస్తున్ని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు వివరాల్లో కి వెళ్ళితే తెలంగాణ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం అనే వాట్సాప్ గ్రూపును నాగర్ కర్నూల్ జిల్లా ఉరుగొండ మండలానికి చెందిన పిల్లెల శ్రీకాంత్ ఓపెన్ చేసి దాని ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారులను అందులో చేరేటట్టుగా చేసి తర్వాత జాతీయ రియల్ ఎస్టేట్ సంఘం లోన్ ఇస్తారని అందులో చేరడానికి సభ్యత్వ రుసుము కింద ఇరవైఐదు వేలు చెల్లించాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం గ్రూపులో నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన పిల్లెల శ్రీకాంత్ పెట్టగా ఇది నిజమేనని నమ్మి సిద్ధిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన వ్యక్తి నాకు లోన్ కావాలి అని తెలంగాణ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం అనే వాట్సాప్ గ్రూప్లో అడగగా వెంటనే పిల్లెల శ్రీకాంత్ అతనికి ఫోన్ చేసి సభ్యత్వ రుసుము కింద ఇరవై ఐదు వేలు పంపమనగా, అట్టి వ్యక్తి నిజమేనని నమ్మి అతనికి గూగుల్ పే ద్వారా రెండు విడతలుగా మొత్తం ఇరవై వేల ఐదు రూపాయలు పంపించాడు తర్వాత అతను ఫోన్ ఎత్తకపోయేసరికి మోసపోయానని తెలిసి దరఖాస్తు ఇవ్వగా ఇట్టి విషయం మీద సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసి,పరిశోధన చేసి అట్టి వ్యక్తిని ఈరోజు పట్టుకొని అరెస్టు చేయడమైనది

# వర్కింగ్ జర్నలిస్ట్ మీటింగ్



మనప్రజాప్రతినిధి//చేగుంట జూన్ 26 :చేగుంట లో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ సమావేశం నిర్వహించిన ఉమ్మడి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు కమ్మరి వెంకటేశం, ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న జర్నలిస్టు అందరికీ ప్రభుత్వం అక్రిడేషన్ కార్డు, హెల్త్ కార్డు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని, జర్నలిస్ట్ పిల్లలకు ప్రవేట్ కళాశాలలో 50% ఫీజు రాయితీ కల్పించాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు, ఈ కార్యక్రమంలో మొజామిల్, అన్నం మహేష్, అన్నం ఆంజనేయులు, కొండి శ్రీనివాస్, ప్రకాష్, నర్సిములు, సోమా ప్రవీణ్, మియాపూర్ రాజు,చౌదరి శ్రీనివాస్, సోమా వెంకటేష్,నాగార్జున, శ్రవణ్,శ్రీకాంత్,రవీందర్, రాజు,తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం




మనప్రజాప్రతినిధి//మేడ్చల్: రైతుకు భరోసా–రేవంతన్న..9 రోజుల్లోనే 9,000 కోట్లు రైతు ఖాతాల్లోకి జమ చేసిన ఏకైక ప్రభుత్వం మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన రైతు భరోసా సంబురాల్లో అన్ని మండల,మున్సిపల్,కార్పొరేషన్ కేంద్రాలలో రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం ఈ రోజు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై నాయకులతో కలిసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, సీనియర్ నాయకులు రాపోలు రాములు,బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు,మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, తదితరులు పాల్గొన్నారు



# చిత్రపటానికి పాలాభిషేకం




మనప్రజాప్రతినిధి//మేడ్చల్ జిల్లా:తెలంగాణ రైతులకు శ్రేయస్సు కొరకే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మరియు మంత్రివర్గం నిర్ణయాలు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా పథకం తొమ్మిది రోజుల్లో 9000 కోట్లు రైతుల ఖాతాలో జమ వేసిన సందర్భంగా ఆనందోత్సవాల్లో రైతులు మేడ్చల్ పట్టణంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పాలభిషేకం చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మేడ్చల్ జిల్లా మేడ్చల్ ఉమ్మడి మండలం, మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల వేముల శ్రీనివాస్ రెడ్డి, గోమారం రమణారెడ్డి , గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం విజయవంతంగా పూర్తి కావడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ,జిల్లా ,మండల, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఫ్లెక్సీకి పాలభిషేకం చేసి రైతు విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జి రవి ముదిరాజ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షులు.

# పెండింగ్ సర్టిఫికెట్లను జారీ



మనప్రజాప్రతినిధి//మేడ్చల్ మల్కాజ్గిరి: పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్ల ను సత్వరమే జారీ చేయాలి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి.వివిధ రకాల సర్టిఫికెట్ల జారీకై చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెను వెంటనే జారీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి రెవెన్యూ అధికారును ఆదేశించారు.గురువారం కుత్బుల్లాపూర్ మండలలో పర్యటించి, మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మింకగా అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం మీ– సేవా ద్వారా చేసుకున్న పెండింగ్ దరఖాస్తులను, రెవెన్యూ రికార్డులను, రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. ప్రజల అవసరాల దృష్టిలో పెట్టుకొని కులం, లోకల్ (స్థానికత) సర్టిఫికెట్లు, ఆదాయం, ఇతరాత్ర సర్టిఫికెట్ల జారీ నిమిత్తం చేసుకున్న దరఖాస్తును ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అని పరిశీలించి, నిర్దేశించిన సమయంలోపు సర్టిఫికెట్లను జారీ చేయాలని ఆదేశించారు. సర్టిఫికెట్ల ఇచ్చే ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పరిపాలన పరమైన ఫైళ్ళను పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే మండలంలోని గాజులరామారంలోని సర్వేనెం: 307 , 342 గల ప్రభుత్వ భూములు, అందుకు సంబందించిన మ్యాపులను అదనపుకలెక్టర్ పరిశీలించారు. భూమిహద్దులు, భూమి యొక్క పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు అక్రమనకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఆర్‌డి ఓ శ్యామ్‌ప్రసాద్, ఇంచార్జీ తహశీల్దార్ స్వామి, రెవెన్యూ సిబ్బంది ,త దితరులు పాల్గొన్నారు.

# టీబీ ముక్తి భారత్ కార్యక్రమం



నంగునూరు జూన్ 26(ప్రజాప్రతినిది): అవగాహన ద్వారానే టిబి వ్యాధిని నివారించవచ్చని రాజగోపాల్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ ఇ ఓ స్వామి అన్నారు గురువారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో టీబీ ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రెండు వారాల మించి దగ్గు ఉన్నట్లయితే టీ బి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మధుమేహం

**-అవగాహన ద్వారానే టీబిని నిర్మూలించవచ్చు**

**-రాజగోపాలపేట పిహెచ్ సి హెచ్ ఈఓ స్వామి...**

హైపర్ టెన్షన్ పేషెంట్లకు ప్రభుత్వమే ఉచితంగా మందులు సరఫరా చేస్తుందని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే వెంటనే స్థానిక ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా పలువురికి బిపి షుగర్ పరీక్షలు చేశారు అనుమానిత కేసులను గుర్తించి వారికి ఎక్స్ రే తెమడా పరీక్షల కోసం 102 వాహనంలో సిద్దిపేట జి జిహెచ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ శ్రీనివాస్ టీబి యూనిట్ సూపర్వైజర్ రాజ హెల్త్ అసిస్టెంట్లు మహేందర్ లింగం గౌడ్ ఏఎన్ఎం జ్యోతి ఆశ వర్కర్లు మన్నెమ్మ బాల్ లక్ష్మి, కవిత రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు



# పెన్ పహాడ్ మండల్ లో

## ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలం

**-ఏసీబీ కి చిక్కిన పంచాయతీ కార్యదర్శి...**

**-పెన్ పహాడ్ (మం) అన్నారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్ పై ఏసీబీ అధికారులు దాడి....**

**-బొగ్గు ఉత్పత్తి కోసం ఎన్ ఓ సి జారీ చేయడానికి లంచం డిమాండ్....**

**-రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ అధికారి....అరెస్ట్ చేసి కేసు నమోదు చేసిన అధికారులు...**



మనప్రజాప్రతినిధి//సూర్యాపేటజిల్లా పెన్ పహాడ్:బొగ్గు ఉత్పత్తి కోసం ఎన్ ఓ సి జారీ చేయడానికి లంచం డిమాండ్ సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలము అన్నారం గ్రామ కార్యదర్శి సతీష్ కుమార్ పై ఏసీబీ అధికారులు దాడి, రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని అరెస్ట్ చేసి కేస్ నమోదు చేసినా అధికారులు. తమకు అధికారం ఉన్నప్పుడే ఆస్తులను పెంచుకుంటాం ప్రజలు ఎక్కడ పోతే ఏమిటి మాకు కావాల్సింది సొమ్ము అంటున్నారు ప్రభుత్వ శాఖల పనిచేసే కొంత మంది అవినీతి అక్రమార్కులు. కిందిస్థాయి సిబ్బంది మొదలుకొని ఉన్నత స్థాయి సిబ్బంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కి జైల్లో ఉసలు లెక్కబెడుతున్నారు అయినా బుద్ధి రావడం లేదు, ఇకనైనా లంచగొండి అధికారులు బుద్ధి తెచ్చుకొని ప్రజా శ్రేయస్ కొరకు ఉద్యోగం చేయండి మీరు కూడా అవినీతి తిమింగలం గా మారకుండా ఉద్యోగం చేయాలని ప్రజలలో పెద్ద ఎత్తున గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంత పెద్ద అధికారైన లంచం తీసుకుంటే కఠినమైన చర్యలు తప్పవు అని అధికారులు అన్నారు.

# విద్యార్థులకు పురస్కారం




నేరేడుచర్ల//మనప్రజాప్రతినిధి:నేరేడు చర్ల మండలకేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల గత పదవతరగతి పరీక్షలలో 100 (52/52) ఉత్తీర్ణతతోపాటు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు గణితశాస్త్రంలో 92 మార్కులకు పైగాసాధించిన ఐదుగురు విద్యార్థులకు పాఠశాలలోగణిత సహోపాధ్యాయులు కొణతం వెంకటరెడ్డివారి తండ్రిగారైన కొనతం సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఒక్కొక్కవిద్యార్థికి వారి తల్లిదండ్రులసమక్షంలో రూ 10,000/ ల చొప్పున మొత్తం రూ. 50,000/ ల నగదు బహుమతిని ఉదయం ప్రార్థన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు బట్టు మధు చేతుల మీదుగా అందించారు అనంతరం హెచ్ఎం బట్టు మధు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలముందు విద్యార్థులలో పోటీతత్వాన్నిపెంచి చైతన్యపరచి ఉత్తమఫలితాలు సాధించేందుకు ఇట్టి నగదుబహుమతినిప్రకటించి ఉత్తమ ఫలితాలుసాధించేందుకు తమవంతుసహకరించిన గణిత సహోపాధ్యాయులు కొణతం వెంకట్ రెడ్డి అభినందనీయులని కొనియాడారు తదుపరి హెచ్ఎం మరియు ఉపాధ్యాయులు గణిత సహోపాధ్యాయులు వెంకట్ రెడ్డిని ఘనంగా సత్కరించి నగదు బహుమతిని పొందిన విద్యార్థులు పాల్వాయికీర్తన, బానోత్ మనోజ్, షేక్ ఇమ్రాన్, సంతోష్, కీర్తి లను అభినందించారు ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి వీరబాబు ఏం సైదులు రషీద్ ఖాన్ జానకిరాములు శౌరి అన్నపూర్ణ నరసింహారావు నాగమణి మాధవి అశ్రుణ్ ఎన్ వెంకటేశ్వర్లు భానుమతి జానయ్య బికోజి యాదగిరి రామ్మూర్తి బాలు శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాసరావు లాలు సాహెబ్ సరస్వతి నాగేష్ తదితరులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు